

ఉపాధి కూలీలకు ఊరట..!

- ఏప్రిల్ 2 నుండి రూ.307లు
- జిల్లాలో 3.64 లక్షల మందికి ప్రయోజనం



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): ఉపాధి హామీ చట్టంలో పనిచేసే ఉపాధి కూలీలకు రోజుకు రూ.307లు వేతనాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇది ఏప్రిల్ 2వ తేదీ నుంచి అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉపాధి హామీ పథకం 2005 నుండి గత 20సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం అతి స్వల్పం రూ.10ల నుండి అత్యధికం రూ.30ల వరకు పెంచుకుంటూవచ్చారు. 2024 సంవత్సరంలో అత్యధికంగా రూ.28లు పెంచారు. 2025లో కేవలం రూ.7లు మాత్రమే పెంచారు. పెరుగుతున్న రేట్లుకు అనుగుణంగా కూలి రేట్లు పెంచలేదని కేవలం రూ.7లే పెంచడంతో ఉపాధి కూలీలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఈపెంపు వల్ల చిత్తూరు జిల్లాలో 31 మండలాల్లో 700 గ్రామపంచాయతీల పరిధిలోని 2.69 జాబ్ కార్డులు ఉన్నాయి. ఇందులో రోజువారి ఉపాధి పనులకు వెళ్తున్న జాబ్‌కార్డు కుటుంబాల 2.18 జిల్లాలో మొత్తం ఉపాధి కూలీలు 4.82లక్షలు ఉన్నారు. చిత్తూరు జిల్లాలో ఉపాధి పని అవసరాన్ని బట్టి ఉపాధి పనులకు హాజరవుతున్నారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వం రూ.7లు వేతనం పెంచడంతో రోజువారి ఉపాధి కూలీలకు వెళ్లే 3.64లక్షల మంది కూలీలకు కొంతమేర ప్రయోజనం చేకూరనుంది. గతంలో వేసవికాలంలో ఫిబ్రవరి నుండి జూన్ వరకు 15 శాతం నుండి 30 శాతం వరకు వేసవి అదనపు భత్యం ఇచ్చేవారు. ప్రస్తుతం గత మూడు సంవత్సరాలుగా నిలిచిపోయాయి. ఈ తరుణంలో కేంద్ర ప్రభుత్వం నామాత్రంగా ఏడు రూపాయలు పెంచడంతో ఈ పెంపు పై ఉపాధి కూలీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

2005 నుండి 2025 వరకు
కేంద్ర ప్రభుత్వం పెంచిన కూలీల రేట్లు వివరాలు

2005	రూ.87.50లు
2015	రూ.193లు
2021	రూ.252లు
2022	రూ.264లు
2023	రూ.272లు
2024	రూ.300లు
2025	రూ.307లు



త్వరితగతిన సమస్యలను పరిష్కరించండి



రెవెన్యూ శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- కుప్పంటౌన్: రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, సమస్యల పరిష్కారంలో అలసత్వం విడాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కడా పీడీ వికాస్ మరమ్మత్‌తో కలిసి కుప్పం పట్టణంలోని మండల అభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్థానికంగా ప్రజలు, ముఖ్యంగా రైతులు పలు రెవెన్యూ సమస్యలపై అధికారులను సంప్రదిస్తూ ఉంటారని, వారి పట్ల అధికారులు గౌరవప్రదంగా నడుచుకోవాలని, వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. రెవెన్యూ అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలను పరిశీలించి, నియమ నిబంధనలకు లోబడి, కాలయాపనకు చోటు లేకుండా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. బాధ్యత రాహిత్యంగా ప్రవర్తిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యల పరిష్కారంలో పారదర్శకంగా అధికారులు పనిచేయాలని తెలిపారు. అలాగే వెబ్లాండ్ ప్యూరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని, ఇప్పటికే గుర్తించిన ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని, ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేసే సరుకులను సకాలంలో లబ్ధిదారులకు అందేలా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో భాగంగా మండలాల వారీగా మ్యూటేషన్లు, ఎఫ్ లైన్ పిటిషన్, ఆర్‌ఓఆర్ సంబంధిత అంశాలపై సమీక్షించారు. కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులు, డిఎస్‌ఓ శంకరన్, కుప్పం, గుడిపల్లి, రామకుప్పం, శాంతిపురం తహసిల్దార్లు చిట్టిబాబు, సీతారాం, కౌలేష్, శివయ్య సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వల్లభ డెయిరీలో ప్రమాదం

- గాయపడిన కార్మికుని ఆదుకోవాలి
- వైద్య ఖర్చులు, కుటుంబానికి ఆర్థికసాయం అందించాలి
- సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

కాణిపాకం సమీపంలోని వల్లభ డెయిరీలో పనిచేస్తున్న పెరుగు ఆపరేటర్ యతిరాజుకు కాస్టిక్ సోడా పడి తల, ముఖం పైన కాళ్లు చేతులు, కళ్ళు కాలిపోవడం జరిగింది. అతను ప్రస్తుతం తిరుపతి రమాదేవి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. డెయిరీ యాజమాన్యం పూర్తిస్థాయిలో వైద్యం అందించకుండా వెంటనే డిశ్చార్జ్ చేయాలని నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు తీవ్రంగా ఖండించారు. కార్మికుడికి పూర్తిగా నయమయ్యేంతవరకు వైద్య ఖర్చులు భరించి అప్పటివరకు కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వల్లభడెయిరీలో దాదాపు 200మంది పైన కార్మికులు పనిచేస్తున్నారని, అక్కడ పనిచేస్తున్న కార్మికులకి ఎలాంటి రక్షణ పరికరాలు ఉపయోగించడం లేదని, కాళ్లకు షూలు కూడా ఇవ్వని పరిస్థితి ఉందన్నారు. అంతమంది పనిచేస్తున్నా వారికి క్యాంటీన్ ఏర్పాట్లు గాని, రవాణా సౌకర్యాలు కల్పించకపోవడం దారుణమన్నారు. ఎక్కువమందికి ఈఎస్ఐ కూడా వర్తింప చేయడం లేదని, ప్రమాదాలు జరిగినప్పుడు అత్యవసరంగా స్పందించాల్సింది పోయి నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. కంటిన్యూగా రాత్రులలో డ్యూటీలు ఇవ్వడం వలన కార్మికులు ఇబ్బందులు పడుతున్నారుని, వారం వారం షిఫ్ట్ మార్చాలన్నారు. కార్మికులు చేసే పని వలన ఎక్కువ లాభాలు ఆర్జిస్తున్న యాజమాన్యాలు కార్మికులకు తక్కువ వేతనాలు ఇవ్వడంతో పాటు పని ఒత్తిడి పెంచుతున్నాయని, ఇటువంటి ప్రమాదాలు జరిగినప్పుడు చట్టప్రకారం ఇవ్వాల్సిన నష్టపరిహార ఇవ్వకుండా తప్పించుకోవడం సరైనది కాదన్నారు. ఇప్పటికైనా గాయపడిన కార్మికుడు యతిరాజు పూర్తిస్థాయిలో కోలుకునేంత వరకు డెయిరీ యాజమాన్యమే వైద్యఖర్చులు అందించి వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని లేనిపక్షంలో కార్మికులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు.



ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న డెయిరీ కార్మికుడు యతిరాజులు

సంగం డెయిరీ ప్రారంభం



డెయిరీని ప్రారంభిస్తున్న ఛైర్మన్ ధూళిపాల నరేంద్ర

ప్రజాశక్తి- రామకుప్పం: మండలంలోని బందార్లపల్లి గ్రామంలో గురువారం సంగం డెయిరీని పొన్నూరు శాసనసభ్యులు, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాల నరేంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా పొన్నూరు శాసనసభ్యులకు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు సాదర స్వాగతం పలికారు. అనంతరం ధూళిపాల నరేంద్ర మాట్లాడుతూ తన తండ్రి ప్రారంభించిన సంగం డెయిరీ దినదినాభివృద్ధి చెందుతూ పాడి రైతులకు సేవలందిస్తూ ఉండడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో 21 చిల్లింగ్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నేడు డెయిరీ పాలసేకరణ కేంద్రాన్ని బందార్లపల్లి గ్రామంలో ప్రారంభించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని స్థానిక పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్, బెండనకుప్పం బాబు, రాజారామ్, వేణు, కదిరప్ప, మండల అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి, రామ్మూర్తి, చలపతి, గుర్రప్ప, కేశవరెడ్డి పాల్గొన్నారు.

ఫ్లెక్సీల ముద్రణకు అనుమతులు తప్పనిసరి



ఫ్లెక్సీ ముద్రణ యజమానులతో మాట్లాడుతున్న నగర కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరంలో విచ్చలవిడిగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయరాదని చిత్తూరు నగరపాలక కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. నగరపాలక కార్యాలయంలో గురువారం ఫ్లెక్సీల ముద్రణ యజమానులతో నిర్వహించిన సమావేశంలో కమీషనర్ మాట్లాడారు. నగరంలో వివిధ ప్రాంతాల్లో విచ్చలవిడిగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారని, దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని అన్నారు. ఫ్లెక్సీల నిర్వాహకులు ఫ్లెక్సీల ఏర్పాటు నిమిత్తం అనుమతి తీసుకోవాలన్నారు. వివిధ కార్యక్రమాల కోసం ఫ్లెక్సీలు ఎన్ని ముద్రిస్తున్నారనే అంశాలపై ముందస్తుగా అనుమతి తప్పనిసరి అన్నారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ బాలాజీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడి మృతికి నివాళి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగంలో ఔట్ సోర్సింగ్ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న కె.రామయ్య మృతికి నగర మేయర్ ఎస్.అముద, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, ఎంహెచ్‌ఓ డాక్టర్ పి.లోకేష్‌లు నివాళులు అర్పించారు. ఐరాల మండలం మఠంపల్లి గ్రామంలోని మృతుడి నివాసానికి వెళ్లి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వం తరఫున మట్టి ఖర్చుల కింద రూ.15వేలు కుటుంబ సభ్యులకు అందించారు. ప్రభుత్వం నుంచి అన్ని విధాల ఆదుకుంటామని చెప్పారు. శానిటరీ ఇన్స్పెక్టర్లు, నగరపాలక అధికారులు, కార్మికులు మృతుడికి నివాళులర్పించారు.



దేవాలయాల అభివృద్ధికి ప్రణాళికలు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం నియోజకవర్గ పరిధిలోని ప్రధాన ఆలయాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని, హంద్రీనీవా కాలువల నుండి చెరువులకు నీటి అనుసంధానం పనులను పూర్తి చేయాలని దేవాదాయ శాఖ అధికారులను, మైనర్ ఇరిగేషన్ అధికారులు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. కుప్పం పర్యటనలో భాగంగా ఆయన కడా పీడీ వికాస్ మరమ్మాత్‌తో కలిసి దేవాదాయ శాఖ అధికారులతో, మైనర్ ఇరిగేషన్ అధికారులతో హార్టికల్చర్ హబ్ లో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను ఏప్రిల్ 15 లోపు సిద్ధం చేయాలని దేవాదాయశాఖ ఎస్‌ఈని ఆదేశించారు. నియోజకవర్గంలో 11 దేవాలయాల అభివృద్ధిలో భాగంగా కుప్పం, పరమసముద్రంలో గల బేతర్ల స్వామి దేవాలయానికి రూ.2.66 కోట్లు, నూలుకుంట గ్రామపరిధిలోని కదిరి నరసింహస్వామి దేవాలయ అభివృద్ధికి రూ.1.35 కోట్లు, శాంతిపురం మండలం రాళ్ళబూదుగురు గ్రామంలోని కోదండ రామస్వామి ఆలయానికి రూ.7.85 కోట్లు కేటాయించామన్నారు. ఈ పనుల ఆరంభానికి టెండర్లు పిలవడం జరిగిందన్నారు. మిగిలిన 8 దేవస్థానాల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను ఏప్రిల్ 15వ తేదీ లోపు సిద్ధం చేయాలని దేవాదాయ శాఖ ఎస్‌ఈ సతీష్‌ను ఆదేశించారు. హంద్రీనీవా పనులను ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని అన్నారు. హంద్రీనీవా కాలువ నీటిని ఫీడర్ ఛానల్ చెరువులకు అనుసంధానం చేయడానికి అవసరమైన పనులను మైనర్ ఇరిగేషన్ అధికారులు చేయాలన్నారు. హంద్రీనీవా స్ట్రక్చర్-1కు సంబంధించి మొత్తం 42 కిలోమీటర్లలలో 33 కిలోమీటర్ల లైనింగ్ లో 11.950 కిలోమీటర్లు పూర్తయినదని, స్ట్రక్చర్-2 కి సంబంధించి మొత్తం 47.562 కిలోమీటర్లలలో 37.802 కిలోమీటర్ల లైనింగ్‌లో 12.760 కిలోమీటర్లు పూర్తయినదని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.



కుప్పం హార్టికల్చర్ హబ్‌లో అధికారులతో సమావేశమైన జిల్లా కలెక్టర్

రక్త పరీక్షలు విరివిగా నిర్వహించాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అక్కడక్కడా మలేరియా, డెంగీ లక్షణాలు కనిపిస్తున్నందున రక్త పరీక్షలు విరివిగా చేపట్టాలని ఫీల్‌లో ఆర్‌డిటి కిట్లు ద్వారా రక్త పరీక్షలు పరీక్షించాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ అన్నారు. గురువారం చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సుధారాణి ఆదేశాలతో ఉపవైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట్ ప్రసాద్, జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నీషియన్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ యాక్టివ్, పాసివ్ పరీక్షలను విరివిగా చేసి పాజిటివ్‌లను నిర్ధారణ చేసి చికిత్స ప్రారంభించాలన్నారు. ఆర్డీటి కిట్లలో డెంగీ పాజిటివ్ వస్తే ఎలిసా పరీక్షకు జిల్లా ఆసుపత్రికి పంపి పరీక్షించి కన్ఫామ్ చేసి వెంటనే చికిత్స ప్రారంభించేటట్లు చూడాలని అప్పుడే డెంగీ మరణాలు లేకుండా చూడొచ్చని తెలిపారు. ప్రతి కేసును ఐహెచ్‌ఐపి పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. దోమలు పుట్టకుండా, దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమాలు పారా మెడికల్ సిబ్బంది ద్వారా గ్రామాల్లో నిర్వహించాలన్నారు. డాక్టర్ వెంకట ప్రసాద్ మాట్లాడుతూ 10 శాతం ఓపీలో తప్పనిసరిగా టిబి పరీక్షలు చేయాలన్నారు. అలాగే పిహెచ్‌సిలో ప్రతి ఆశ కార్యకర్త ప్రతివారం గల్ల పరీక్ష కిట్ల ద్వారా క్వాలిటీ గళ్ళను అనుమానిత కేసుల నుంచి సేకరించి పిహెచ్సీలో పరీక్షించాలన్నారు. డాక్టర్లు సూపర్వైజర్లు వీటన్నింటినీ మానిటర్ చేస్తూ పాజిటివ్ వచ్చిన పేషెంట్స్‌కి చికిత్స ప్రారంభించి పూర్తి అయ్యేటట్లు చూడాలన్నారు. కొత్త కేసులకు ప్రతినెలా రూ.1000లు డిబిటి ద్వారా వారి అకౌంట్లో పౌష్టికాహారం నిమిత్తమై వేయబడుతుందని తెలిపారు. 2025కు టీబీ లేని సమాజస్థాపనే అందరి ధ్యేయం అని తెలిపారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి శివకుమార్, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

తడి, పొడిచెత్తపై ప్రజలకు అవగాహన



ప్రజాశక్తి- సోమల: పరిసరాల పరిశుభ్రతతో ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అందులో భాగంగా తడి, పొడి చెత్త వేరు చేసి గ్రామంలో ప్రతి ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ వాహనంలో వేసి పంచాయతీ సిబ్బందికి సహకరించాలని ఈవో ఆర్డీ లక్ష్మీదేవి కోరారు. గురువారం దిడ్డివారిపల్లి దాసరి గూడెంలో పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌తో కలసి ప్రజలకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్త వేరుగా సంపద సృష్టికేంద్రాలకు తరలించి వానపాముల ద్వారా ఎరువులను తయారు చేసి వాటి అమ్మకంతో పంచాయతీలు ఆదాయం సమకూర్చుకోవాలని కోరారు.

పెద్దపంజాణి: గ్రామాల్లో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టి పారిశుధ్య నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఈఓపిఆర్డీ శారదాదేవి అన్నారు. గురువారం మండలంలోని కోగిలేరు గ్రామపంచాయతీలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ జాతీయ రహదారుల పక్కన పేడ దిబ్బలు వేయరాదని, మురుగునీటి కాలువలు తరచూ శుభ్రం చేయాలన్నారు. ప్రజలు ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం వేయరాదని సూచించారు. ఇప్పటికే పేడ దిబ్బలు ఉన్నట్లు గుర్తించినట్లైతే సంబంధిత యజమానికి తెలిపి వెంటనే తొలగించాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించాలని కార్యదర్శులకు సూచించారు. అనంతరం పొట్టగానిపల్లెలో గ్రామంలో పారిశుధ్య కార్మికులు చేపడుతున్న చెత్త సేకరణ కార్యక్రమంపై ఆరా తీశారు. ప్రతి సోమవారం ప్రభుత్వం నిర్దేశించిన ఫోన్ నెంబర్ల ద్వారా చెత్త సేకరణ, పారిశుధ్య కార్యక్రమాలపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటారన్నారు. అలా ఫోన్ కాల్స్ వచ్చినప్పుడు ప్రజలు ఫోన్ తీసి తమ అభిప్రాయాలను వ్యక్తం చేయాలని సూచించారు. సర్పంచ్ రమేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి సుజాత పాల్గొన్నారు.



తాగునీటి సమస్యలను నివారించండి

ప్రజాశక్తి- కుప్పం టౌన్: వేసవిని దృష్టిలో ఉంచుకొని కుప్పం నియోజకవర్గ పరిధిలో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. గురువారం కుప్పంలో పర్యటించిన ఆయన కడా కార్యాలయంలో పురపాలక సంఘం కమిషనర్, నాలుగు మండలాలకు చెందిన ఎంపీడీవోలతోపాటు ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకొని అధికారులు ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఇది వరకే సూచించడం జరిగిందన్నారు. ఈ పనులను పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో భూగర్భ జలాల నీటిమట్టం తగ్గుతున్నదని, దీన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు క్షేత్రస్థాయిలో పంచాయతీ సెక్రటరీలు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేయడంలో పూర్తి బాధ్యతా వహించాలన్నారు. గ్రామ పంచాయతీ నిధులను తాగునీటి సమస్య పరిష్కారానికి వినియోగించడంలో అందుకు సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ సమస్య ఉన్నచోట బోర్లకు డిపనింగ్ చేయడం, అవసరమైన చోట కొత్త బోర్లు వేయడం జరుగుతున్నదని, బోర్లు వేసినప్పటికీ విద్యుత్ కనెక్షన్ లేకపోవడంతో తాగునీరు సరఫరా చేయలేక పోతున్నామని కలెక్టర్‌కు వివరించారు. ఈ విషయమై స్పందించిన కలెక్టర్ వెంటనే రెస్కో అధికారులతో మాట్లాడి వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కుప్పం మునిసిపాలిటీ, మండలాల వారీగా తాగునీటి సమస్య పరిష్కారానికి తీసుకున్న చర్యలపై సమీక్షించారు.

పన్నుల వసూళ్లలో

పలమనేరుకు రాష్ట్రంలో 8వ స్థానం



ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు పురపాలక సంఘం 2024-25 ఆర్థిక సంవత్సరంకు సంబంధించి ఇంటిపన్ను, నీటి చార్జీలు, ఖాళీ జాగా పన్నుల వసూళ్ళలో రాష్ట్ర స్థాయిలో 8వ స్థానంలో, రీజియన్ స్థాయిలో 2వ స్థానం, జిల్లా స్థాయిలో మొదటి స్థానం కైవసం చేసుకుందని కమిషనర్ ఎన్‌వి.రమణారెడ్డి పేర్కొన్నారు. పన్నుల వసూళ్లలో విశేష కృషి కనపరిచిన రెవెన్యూ ఆఫీసర్ టి.రవిరెడ్డి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ జి.యోగరంజిని, బిల్ కలెక్టర్లు కె.కిరణ్ కుమార్, షరాబు, పిఎస్.శివ కుమార్‌ను గురువారం ఘనంగా సన్మానించారు. రాబోవు సంవత్సరాలలో కూడా అంతకన్నా మెరుగైన ఫలితాలు సాధించాలను ఆకాంక్షించారు. కార్యక్రమంలో మేనేజర్ ఎస్ఎం. ఖాదరు మొహిద్దీన్, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్ బాబు, అసిస్టెంట్ ఇంజనీర్ స్నేహ ప్రియన తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై విస్తృత ప్రచారం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : శక్తి యాప్స్, పోక్సో చట్టం, మహిళల అత్యవసర నంబర్లపై విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్న చిత్తూరు మహిళా పోలీసులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ మేరకు గురువారం విజయం డిగ్రీ కాలేజ్ ఎస్‌వి సెట్ ఇంజనీరింగ్ కాలేజీలో మహిళా డీఎస్పీ విజయశేఖర్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ మహిళల భద్రత కోసం ప్రభుత్వం ప్రారంభించిన శక్తి యాప్ అత్యవసర సమయంలో ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. అత్యవసర సమయంలో ఒకే బటన్ ప్రెస్ చేయగానే సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం చేరుతుందన్నారు. ఈ యాప్ అత్యవసర పరిస్థితుల్లో మహిళలకు తక్షణ సహాయం అందించేందుకు ఉపయోగపడుతుందని, ప్రమాదకర పరిస్థితుల్లో యాప్ ద్వారా పోలీసులకు సమాచారం చేరవేయడం, కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో పాటు, అత్యవసర సేవలు అందించేందుకు ఇది ఎంతో మేలైన సాధనమని పేర్కొన్నారు. ప్రతి యువతి, మహిళా శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో మహిళా ఎస్ఐ నాగ సౌజన్య, కాలేజీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మురుగునీటి కాలువలో పూడికతీత

ప్రజాశక్తి వార్తకు స్పందన

జెసిబితో శుభ్రం చేయించిన పంచాయతీ కార్యదర్శి.


కాలువలో పూడికలు తీసిన దృశ్యం

ప్రజాశక్తి- సోమల మండల కేంద్రమైన సోమల నుండి పుంగనూరు మార్గంలోని బోయకొండ గంగమ్మ ఆలయ సమీపంలోని ప్రధాన రహదారిపై మురుగునీటి కాలువ చెత్తాచెదారంతో నిండిపోయి మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తూ ఉండడంతో ఈనెల 29వ తేదీ ప్రజాశక్తిలో రోడ్డుపైనే మురుగునీరు వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన పంచాయతీ కార్యదర్శి జయశంకర్ గురువారం జెసిబితో కాలువలోని చెత్తాచెదారాన్ని శుభ్రం చేయించి మురుగునీరు రోడ్డుపై ప్రవహించకుండా సజావుగా వెళ్లే విధంగా చేయించారు. దీంతో అటు పాదచారులు ఇటు వాహన చోదకులు ప్రజాశక్తికి అభినందనలు తెలియజేశారు.

15న ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి- చౌడేపల్లి: ఈనెల 15న స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి పవన్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో ఆయన మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం కోలారు ఆర్ఎల్ జలప్ప ఆసుపత్రి పరిశోధన కేంద్రం దేవరాజ అరసు వైద్య మహావిద్యాలయం ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తారన్నారు. శిబిరంలో కంటి పరీక్షలు చేసి శుక్లంకు ఆపరేషన్ అవసరమైన వారిని గుర్తించి ఆపరేషన్ల కొరకు వెళ్లిన వారికి ఆర్.ఎల్ జలప్ప ఆసుపత్రిలో విజయవంతంగా చేస్తారన్నారని, ఉచిత వాహన సదుపాయం, భోజన వసతి కల్పిస్తారన్నారని తెలిపారు. ఆసక్తి గలవారు కంటి ఆపరేషన్‌కు వెళ్లదలచిన వారు ఆధార్ కార్డు రేషన్‌కార్డు నకలు తీసుకురావాలని ఆయన సూచించారు.

జీవనోపాధి పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - రామకుప్పం: స్వయం సహకార సంఘ మహిళలు తమ జీవనోపాధిని పెంపొందించుకోవాలని రాష్ట్ర నేత మునస్వామి, టిడిపి మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి తెలిపారు. గురువారం సంఘ సభ్యులతో వారు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ 2025- 26 సంవత్సరానికి గాను జీవనోపాధులకు వ్యాపారం, వ్యవసాయం పాడిపరిశ్రమ, చేనేత కార్మికులకు బ్యాంకు రుణాలు అందించడం జరుగుతుందన్నారు. మండలంలో 1440 సంఘాలతో 14780 మంది సభ్యులు జీవనోపాధిని పెంపొందించుకొని ఆర్థికంగా స్థిరపడాలన్నారు. ఆర్థిక ప్రణాళికలు సిద్ధం చేసుకుని రుణాలను దశలవారీగా మంజూరు చేస్తారన్నారు. ఈ అవకాశాల్ని ప్రతి ఒక్కరు అందిపుచ్చుకోవాలన్నారు. ఎంపీపీ సులోచన గుర్రప్ప, వైస్ ఎంపీపీ వెంకట్రామ గౌడు, నరసింహులు, చిన్నకృష్ణ, చలపతి, రామ్మూర్తి, మహమ్మద్ రఫీ, జయశంకర్ పాల్గొన్నారు.

చెత్త సేకరణపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి- వెదురుకుప్పం: ఇంటి నుంచి తడి, పొడి చెత్త సేకరణ కార్యక్రమంలో భాగంగా ఐవిఆర్ఎస్ ఫోన్ కాల్స్ ద్వారా ప్రజా అభిప్రాయాన్ని సేకరించుటకు మండలంలోని 5 పంచాయతీలు ఎన్నికయ్యాయని ఇన్‌ఛార్జి ఎంపీడీవో పురుషోత్తం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని పచ్చికాపల్లం, కొమరగుంట, వెదురుకుప్పం, పాతగుంట, నల్ల వెంగనపల్లి ఇందుకు ఎంపికైనట్లు తెలిపారు. గ్రామపంచాయతీలో విధిగా చెత్త సేకరణ జరగాలని, మైక్ అనౌన్స్మెంట్, కరపత్రాలు, బ్యానర్స్, స్వయం సహాయక సంఘాల ద్వారా ఐవీఆర్ఎస్ కార్యక్రమాన్ని అందరికీ తెలియజేసి 100శాతం ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఔత్సాహిక వ్యాపారవేత్తల సదస్సు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేర్ డిపో పరిధిలో ఉన్న ఖాళీ స్థలాలు బిడ్డర్స్ సదస్సు ఔత్సాహిక వ్యాపారవేత్తలకు గురువారం పలమనేరు గ్యారేజ్‌లో సదస్సు నిర్వహించారు. చిత్తూరు రీజినల్ డిపిటిఓ ఎం.జగదీష్, ఈఈ చెన్నకేశవులు, ఏఈ ప్రతాప్, డిఎం టికె.స్వామి పాల్గొన్నారు. వారి సంస్థలో ఉన్న ఖాళీ స్థలాలు వాటి గురించి వివరంగా తెలియజేశారు. అలాగే వారికున్న సందేహాలు నివృత్తి చేశారు. సమావేశంలో 25 మంది ఔత్సాహికులు హాజరయ్యారు.

సీతారామయ్యకు ఘనసన్మానం



ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు నియోజకవర్గం పత్తికొండ గ్రామంలోని ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం పలువురు దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన భోజనశాలను గురువారం ఉదయం దాత శ్రీపురం సీతారామయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీపురం సీతారామయ్యను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విరాళం ఇచ్చిన దాతలు పాల్గొన్నారు. అనంతరం ఉచిత ఆరోగ్యశిబిరంలో 150 మంది పాల్గొని వైద్యపరీక్షలు చేయించుకున్నారు. సిగురాజపు శెట్టి, డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

బస్టాండ్‌లో ఆర్టీసీ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ఆర్టీసీ బస్టాండ్లో ఆర్టీసీ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికులకు కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని వార్తలు రావడంతో అధికారులు స్పందించారు. తాగునీటి వసతి ఏర్పాటు చేస్తామని చెప్పారు. బస్టాండ్లో ఎమ్మార్పీ ధరలకే వస్తువులు విక్రయించాలని ఆదేశించారు. ఎక్కడపడితే అక్కడ ప్రైవేట్ వాహనాలు పార్కింగ్ చేయరాదని హెచ్చరించారు.

ముస్లిం వర్గాల సంక్షేమానికి టిడిపి కట్టుబడింది

ప్రజాశక్తి- పుంగనూరు: పేదప్రజలు, ముస్లిం వర్గాలకు వారి సంక్షేమానికి కట్టుబడినందుకు జిల్లా ప్రియాంక సేవాదళ్ అధ్యక్షుడు సజ్జాద్ బాష ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఇందిరా సర్కిల్లో గురువారం ఆయన మాట్లాడుతూ వక్ఫ్ బిల్లు సవరణ విషయంలో ముస్లిం పక్షాన టిడిపి పోరాడిందని అన్నారు. టిడిపి లేవనెత్తిన 3 సవరణలకు జేపీసి ఆమోదం తెలిపిందని, ఆస్తులు పునఃపరిశీలనకు అవకాశం లేకుండా, వక్ఫ్ ఆస్తులు నిర్ధారణలో జిల్లా కలెక్టర్ తుది అధికారం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం హయ్యర్ ర్యాంకింగ్ అథారిటీ ఉన్న అధికారిని నియమిస్తుందని, డిజిటల్ పత్రాలను సమర్పించేందుకు ఆరు నెలలకు పైగా గడువు పొడగింపు, ముస్లిం మేతరులకు బోర్డులో ప్రాతినిధ్యం కల్పించడం అనేది రాష్ట్రాల విచక్షణకు వదిలి పెట్టాలని పార్లమెంటులో కోరడం అభినందించదగ్గ విషయమన్నారు.

స్టూడెంట్ కిట్స్ స్టాక్ పాయింట్ తనిఖీ



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: రాబోవు విద్యాసంవత్సరానికి (2025-26) సంబంధించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర స్టూడెంట్ కిట్ స్టాక్ పాయింట్‌ను జిల్లా సమగ్రశిక్ష చిత్తూరు అడిషనల్ కోఆర్డినేటర్ వెంకటరమణ తనిఖీ చేశరు. గురువారం స్థానిక బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్టాక్ పాయింట్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ముందుగా స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయం సందర్శించి హాజరు పట్టికను, ఆఫీస్ రికార్డ్సను పరిశీలించారు. అలాగే 7వ తేదీ నుండి జరిగే సెల్ఫ్ అసెస్మెంట్ టర్మ్- 2 క్వశ్చన్ పేపర్ల భద్రతాను పరిశీలించడం జరిగింది. ఆయన వెంట మండల విద్యాశాఖ అధికారులు వేణుగోపాల్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, ఎంఐఎస్ ఇర్షాద్ ఆలీ, సిఆర్‌పిలు రామచంద్ర, షాబుద్దీన్, స్వర్ణలత, పిటిఐ అజమత్ అలీ పాల్గొన్నారు.

వేలం ద్వారా రూ.7.50లక్షలు ఆదాయం

ప్రజాశక్తి- యాదమరి: యాదమరి వారపు సంత వేలం రూ.7.50 లక్షలు అధిక మొత్తంలో వేలంపాట ద్వారా ఆదాయం సమకూరింది. యాదమరి పంచాయతీకి చెందిన వారపు సంతని గురువారం డిఎల్‌పిఒ పార్వతి అధ్యక్షతన వేలంపాట నిర్వహించారు. పర్యవేక్షణ అధికారులుగా మండల అభివృద్ధి అధికారి వేణు, ఈఓపిఆర్డి సుకుమార్ రెడ్డి పాల్గొన్నారు. పంచాయతీలోని చిన్ని రెడ్డిపల్లె క్రాస్ వద్ద నిర్వహిస్తున్న వారపు సంత సంవత్సరం రోజులు కాల పరిమితికి రూ.3.70 లక్షల నుండి వేలం ప్రారంభమైంది. వేలంపాటలో మొత్తం 11మంది పాల్గొన్నారు. చిన్నంపల్లి గ్రామానికి చెందిన జార్జ్ రూ.7.50లక్షలు సంతను వేలంను దక్కించుకున్నారు. పంచాయతీకి పెద్ద మొత్తంలో ఆదాయం రావడంతో అభివృద్ధి పనులపై ఈ నిధులను వెచ్చించినట్లు పంచాయతీ అధికారి తెలిపారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



ప్రజాశక్తి- కుప్పం రూరల్: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఆర్థిక భరోసాను అందిస్తుందని కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్, పురపాలక సంఘం టిడిపి అధ్యక్షులు రాజకుమార్‌లు తెలిపారు. గురువారం పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక టిడిపి కార్యాలయంలో అందజేశారు. పట్టణానికి కొత్తపేటకు చెందిన జీవరత్నం, రమాదేవి, షమీమ్‌లకు చెక్కులు అందించారు. కార్యక్రమంలో ముఖేష్ (అప్పు), మణి, లోకేష్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసి తప్పనిసరి: తహాశీల్దార్

ప్రజాశక్తి- గంగవరం: ప్రభుత్వం ఆదేశాల మేరకు కుటుంబంలోని ప్రతి ఒక్కరూ ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని గురువారం తహాశీల్దార్ మాధవరావు ఓ ప్రకటనలో తెలిపారు. గత రెండు నెలలుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, మండలంలో ఇంకా 30శాతం వరకు ప్రజలు ఈకేవైసీ చేసుకోలేదని, ఇప్పటికే రెండు పర్యాయాలు సమయం పెంచామని తెలిపారు. ఇకపై ఈకేవైసీ చేసుకుని ఎడల ప్రభుత్వ పథకాలు వర్తించవని, కావున ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

నాగపడిగ విరాళం

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమలలోని శ్రీ యోగాభి రామస్వామిగారి ఆలయ ప్రాంగణంలోని శ్రీ అన్నపూర్ణ సమేత మరకత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన చిన్నపాప రూ.11 వేలు విలువ చేసే నాగపడిగ గురువారం ఆలయ అర్చకులు రామరత్నం శాస్త్రికి అందజేశారు. మరకత లింగానికి నాగపడిగ అలంకరణ చేసి తదుపరి పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మాత శిశుమరణాలను నివారించాలి


జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సుధారాణి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నందున వడదెబ్బ మరణాలు రాకుండా చూసుకోవాలని, వడదెబ్బ, వడగాల్పులపై ముందస్తు జాగ్రత్తలను, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి.సుధారాణి తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ప్రోగ్రాం అధికారులతో, స్టేట్ కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వీరపాండ్యన్ గురువారం జూమ్ ద్వారా రివ్యూ చేశారు. డిఎంఅండ్‌హెచ్ఓ మాట్లాడుతూ ప్రజలందరికీ అభ ఐడి క్రియేట్ చేయాలని తద్వారా అన్ని రకాల ప్రోగ్రామ్స్‌ను సులభంగా మానిటర్ చేయచ్చన్నారు. అలాగే ఎన్‌సిడి సర్వేలో సస్పెక్ట్ కాబడిన కేసులను వైద్యాధికారులు చికిత్స చేసి అవసరమైతే ఆశాల ద్వారా రిఫరల్ యూనిట్‌కి పంపి కన్ఫర్మ్ అయితే వెంటనే చికిత్స ఇస్తూ ఫాలోఅప్ 100శాతం చేయాలన్నారు. మాత శిశు మరణాలు రాకుండా గర్భస్థ సమయం నుంచి అందించాల్సిన సేవలు తప్పక ఇస్తూ హాస్పిటల్‌లో కాన్పులు చేసినట్లయితే మరణాలు లేకుండా చూడొచ్చు అన్నారు. కాన్పులన్నీ తప్పనిసరిగా పిహెచ్సి, సిహెచ్సిలో చేయాలని, హైరిస్క్ కేసులు మాత్రం జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేయాలన్నారు. సిజేరియన్ ఆపరేషన్ ద్వారా కాన్పులు చాలా తక్కువ ఉండాలని తెలిపారు. ఆర్‌సిహెచ్, ఐడి కి అభ ఐడి తప్పనిసరిగా 100 శాతం లింక్ చేయాలని, ఏలాంటి షార్ట్ పాల్ ఉండకూడదన్నారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల యాప్స్‌లో 100శాతం ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. ప్రధానమంత్రి జన్ ఔషది యోజనను తక్కువ రేటుతో మందులను అందరూ వినియోగించుకునేటట్లు అవగాహన కల్పించాలన్నారు. అలాగే ప్రతి 3వ శనివారం తప్పనిసరిగా స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. అన్ని రకాల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల్ని ఆహారంగా తీసుకోండి..


కూరగాయలు షాప్‌ను ప్రారంభిస్తున్న మేనేజర్ వాసు

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: సేద్యంలో ప్రకృతిపరంగా తయారయ్యే వ్యవసాయ ఉత్పత్తులను ప్రజలందరూ ఆహారంగా తీసుకోవాలని డిఆర్‌డిఏ ప్రాజెక్టు మేనేజర్ వాసు అన్నారు. మండలంలో ఎన్‌పిఎం షాప్‌ను జిల్లా ప్రాజెక్టు మేనేజర్ గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు, కషాయాలు అమ్మే షాపులో లభించే సేంద్రియ కూరగాయలు తీసుకుని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. వెలుగు ఏపీఎం ఫరీద్ మస్తాన్ మాట్లాడుతూ గ్రామాలలో పండిస్తున్నటువంటి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులును వాడి అనారోగ్యంకు గురికాకుండా జీవితం ముందుకు సాగించాలని కోరారు. నిర్వాహకులు శిరీష మూర్తి, ఎన్‌పిఎం సిబ్బంది ప్రతాప్, ధనలక్ష్మి, హేమవతి, రేవతి, భాస్కర్‌రెడ్డి, గణపతి, జయరామన్, కళవతి, రామేశ్వరి పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన రష్యన్ ఫెడరేషన్ కాన్సుల్ జనరల్



ప్రజాశక్తి - వరదయ్యపాలెం: చెన్నైలోని రష్యన్ ఫెడరేషన్ కాన్సుల్ జనరల్ వాలెరీ ఖోడ్‌జేవ్ గురువారం శ్రీసిటీని సందర్శించారు. కాన్సుల్ జనరల్, ఆయనతో పాటు విచ్చేసిన అధికారుల బందానికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఇండో-రష్యన్ వాణిజ్య సంబంధాలు మరింత బలపడేందుకు, వ్యాపార సహకారాన్ని పెంపొందించడంలో ఈ పర్యటన అత్యంత కీలకమైనదిగా రవీంద్ర సన్నారెడ్డి వ్యాఖ్యానించారు. ఇప్పటికే రష్యన్ సంస్థ కుయిబిషెవ్ అజోట్ పరిశ్రమ ఇక్కడ ఏర్పాటైనట్లు గుర్తుచేసిన ఆయన, ఈ సందర్శన ఫలితంగా మరిన్ని రష్యన్ పరిశ్రమలు భారత మార్కెట్‌కు తమ ప్రధాన స్థావరంగా శ్రీసిటీని ఎంచుకుంటాయన్న విశ్వాసం వ్యక్తం చేశారు. శ్రీసిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్ పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా కాన్సుల్ జనరల్ శ్రీసిటీ పరిసరాలతో పాటు కుయిబిషెవ్ అజోట్ పరిశ్రమను సందర్శించారు. సిద్ధార్థ లాజిస్టిక్స్ పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ నిశ్చల్ పాధ్యాతో చర్చలు జరిపారు.

7న విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల మహాధర్నా



ప్రజాశక్తి - తిరుపతి సిటి ఈనెల ఏడో తేదీ ఎస్‌పిడిసిఎల్ కార్యాలయం వద్ద జరగనున్న ఆందోళనకు కాంట్రాక్టు కార్మికులు పెద్దసంఖ్యలో తరలిరావాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జయచంద్ర పిలుపునిచ్చారు. గత 11 రోజులుగా ఎస్‌పిడిసిఎల్ కార్యాలయం వద్ద రిలేదీక్షలు జరుగుతున్నా ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సోమవారం జరగనున్న మహాధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ సాయిలక్ష్మి, లక్ష్మి, సుజాత, ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి కుమార్ పాల్గొన్నారు. దీక్షల్లో శ్రీకాళహస్తి కార్యదర్శి రవి, నాయకులు మురళి, హరి, హుస్సేన్‌పీర్, ఆత్మకూరు కార్యదర్శి విజయరామిరెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, అలీ పాల్గొన్నారు.

చిక్కదు..దొరకదు..!

సిసి కెమెరాల్లో కదలికలు
బోనులో పడని చిరుత
ఎస్వీయూలో అలర్ట్



ప్రజాశక్తి - క్యాంపస్ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిసర ప్రాంతాలలో ఏడాదిగా పలు జంతువులపై చిరుత స్వైర విహారం చేస్తోంది. శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం, స్విమ్స్, ఎస్వీయూ, శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం, శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల, జూపార్క్ రోడ్డు, అలిపిరి తదితర ప్రాంతాలలో చిరుత పులి సంచరిస్తూ ఉంది. అలిపిరి రోడ్డు మార్గంలో మూడు నెలల క్రితం పట్టపగలే రోడ్డు దాటుతుండగా ఒక బైక్ చిరుత పులిని ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన తెలిసిందే. ఇటీవల కాలంలో ఎస్వీయూలో చిరుత పులి దాడిలో వర్సిటీలోని అనేక ప్రాంతాలలో సాధు జంతువు అయిన కుక్కలు కనుమరుగైన సంఘటనలు కోకొల్లలు. దీన్ని దష్టిలో ఉంచుకొని ఎస్వీయూ ఉన్నతాధికారులు, అటవీ శాఖ ఉన్నతాధికారుల సహాయంతో పలుచోట్ల బోన్లను ఏర్పాటు చేశారు. వర్సిటీలో ఉదయం 7 గంటల లోపు సాయంత్రం 6 గంటల తర్వాత ఎవరు సంచరిద్దరించవద్దని హెచ్చరిక బోర్డులను కూడా ప్రదర్శించారు. అయితే చిరుత పులి చాలా తెలివిగా వ్యవహరిస్తూ బోన్లు పెట్టిన ప్రాంతాన్ని అతి జాగ్రత్తగా గమనిస్తూ బోన్ లో పడకుండా తెలివిగా వ్యవహరించి తప్పించుకు తిరుగుతూ ఉందని అటవీశాఖ అధికారులు చెప్పారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పట్టుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో వర్సిటీ ఉన్నతాధికారులు ఐ బ్లాక్ పరిసర ప్రాంతాల చుట్టూ, ప్రధాన గ్రంథాలయం వెనుక భాగంలో, విభాగం చుట్టుపక్కల, హెచ్ బ్లాక్ పరిసర ప్రాంతాలలో పరిసర ప్రాంతాలలో ముళ్లకంపలను పూర్తిగా పరిశుభ్రం చేయించారు. అయినా చిరుత పులి తన దాడులను జింకలపై కొనసాగిస్తూనే ఉంది. రెండు రోజుల క్రితం ప్రధాన లైబ్రరీ వెనుక భాగంలో ఒక జింక పిల్ల పై దాడి చేసిన చిరుత పులి, నేడు ఇంజనీరింగ్ కళాశాల సభ సమీపంలో ఒక తల్లి జింక పై దాడి చేసింది. చిరుత పులి సీసీ కెమెరాల్లో కనిపిస్తుంది కానీ, బోనులకు మాత్రం చిక్కడం లేదు. అటవీ శాఖ అధికారులు ఆ చిరుత పులి తన పిల్లల కని, ఆవాసంగా మార్చుకుని ఇక్కడే పిల్లలకు ఆహారం అందించేందుకు అనుకూలంగా ఉన్న ఎస్వీయూ, వేదిక్, పశు వైద్య వర్సిటీ, వ్యవసాయ కళాశాల పరిసర ప్రాంతాల్లోని కుక్కలను, ఇతర చిన్న చిన్న జంతువులను, జింకలను, పందులను వేటాడుతూ జీవనం సాగిస్తున్నట్లు తెలుస్తుందని వారు వెల్లడించారు. నేడు ఎస్వీయూలో జింకపై చేసిన చిరుత పులి దాడితో వర్సిటీలో విద్యార్థులు సిబ్బంది ఒక్కసారిగా భయభ్రాంతులకు గురి అవుతున్నారు. వెంటనే రాష్ట్రస్థాయిలో ఉన్నతాధికారులతో సంప్రదించి ఎస్వీయు అధికారులు చిరుత పులిని బంధించే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో భవిష్యత్తులో కచ్చితంగా వర్సిటీలలో పనిచేసే సిబ్బందిని, విద్యార్థులను కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

క్రైం న్యూస్

తల్లిని కాపాడే ప్రయత్నంలో

తండ్రిని చంపిన కొడుకు



ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం: మద్యానికి బానిసైన తండ్రి నుంచి తల్లిని కాపాడే ప్రయత్నంలో కన్నకొడుకే తండ్రిని చంపిన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. మృతుని అన్న సుబ్రహ్మణ్యం గురువారం ఎస్ఆర్ పురం పోలీస్ స్టేషన్లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.... చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎస్ఆర్ పురం మండలంలోని పాపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు మందడి (60) మద్యానికి బానిసై భార్య జ్యోతితో ప్రతిరోజు ఇంట్లో గొడవపడేవారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం భార్యాభర్తల మధ్య గొడవ తీవ్రస్థాయికి చేరడంతో శ్రీనివాసుల మందడిని కొడుకు నాగరాజులు మందడి (36) ఆవేశాన్ని ఆపుకోలేక కన్నతండ్రిపై పక్కనే ఉన్న ఇటిక రాయితో దాడి చేశాడు. ఈ గొడవలో శ్రీనివాసుల మందిడికి తలకి బలమైన గాయాలవడంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మృతుని అన్న సుబ్రహ్మణ్యం మందడి పోలీసులకు తమ తమ్ముడిని కొట్టి చంపారని ఫిర్యాదు చేయడంతో కార్వేటి నగరం సిఐ హనుమంతప్ప ఎస్ఆర్ పురం ఎస్సై సుమన్ తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని చేరుకుని విచారించి కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

ఉపాధి కూలీల ట్రాక్టర్ బోల్తా

19 మందికి గాయాలు - క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే, ఏపీడీ


నగరి ఆస్పత్రిలో క్షతగాత్రులకు వైద్యం అందిస్తున్న వైద్యులు


పెళాసపాళెం రోడ్డులో బోల్తా పడిన ట్రాక్టర్

ప్రజాశక్తి- విజయపురం: విజయపురం మండలం పన్నూరు సమీపంలో పెళాసపాళెం రోడ్డులో ట్రాక్టరు ట్రక్కు బోల్తాపడి 19 మంది ఉపాధి కూలీలకు రక్త గాయాలైన సంఘటన గురువారం జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలు.. మండలంలోని ఆమగుంట నుండి ఉపాధి హామీ పనుల నిమిత్తం పన్నూరు అడవిలో పనులు చేయడానికి ట్రాక్టరులో 20 మంది కూలీలు వెళ్లారు. మార్గ మధ్యమంలో పన్నూరు దళితవాడ సమీపంలో పెళాసపాళెం రోడ్డులో ట్రాక్టరు ఇంజన్ ముందరి టైరు ఊడిపోవడంతో ట్రాక్టరు అదుపుతప్పి ట్రక్కు బోల్తా పడింది. ట్రక్కులో ప్రయాణిస్తున్న 20 మంది ఉపాధి కూలీలలో 19 మంది గ్రాయాలు కావడంతో 108 ద్వారా నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మాజీ ఎంపీటీసీ కాంతమ్మకు చేతి ఎముక విరగడం, అములు తలకు రక్త గాయాలు కావడంతో ఇద్దరినీ తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. మిగిలిన 17 మందికి నగరి ఏరియా ఆస్పత్రిలోనే చికిత్స అందించారు.

మెరుగైన వైద్యం అందించండి: ఎమ్మెల్యే భాను

నగరి ఏరియా ఆస్పత్రిలో చిక్సిత పొందుతున్న ఉపాధి కూలీలను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పరామర్శించారు. అందరికీ మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను సూచించారు. కూలీలు అందరూ ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. అలాగే చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, ఉపాధి ఏపీడీ సునీల్ కుమార్, ఎంపీడీవో రాజేంద్ర, ఏపీవో ధనయ్య కూలీలను పరామర్శించారు.

బైక్ నుంచి పడి మహిళకు గాయాలు



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: ద్విచక్రవాహనంలో వెనుక వైపు కూర్చున మహిళ జాడిపడి తలకు తీవ్రగాయమైన సంఘటన గురువారం మండలంలోని దేవదొడ్డి మలుపు వద్ద చోటు చేసుకుంది. పలమనేరు మండలంలోని అగ్రహారం గ్రామం నుంచి కర్ణాటక రాష్ట్రానికి చెందిన పిలవరం గ్రామంకు శంకరప్ప అతని భార్య భవ్యశ్రీ(24), పిల్లలు వేణు, జనని ద్విచక్రవాహనంపై వెళుతున్న సమయంలో దేవదొడ్డి మలుపు వద్ద వెనక వైపు కూర్చున్న భవ్యశ్రీ అకస్మాత్తుగా కిందకు పడిపోయింది. దీంతో తీవ్రంగా గాయపడింది. అదే సమయంలో అటుగా వస్తున్న తీర్థం పిహెచ్‌సి డాక్టర్ అరుణకుమార్ గమనించి 108 ద్వారా ఆమెను బైరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రాథమిక వైద్యం అందించి మెరుగని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

6 నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం ఆవులపల్లె పంచాయతీ పట్రపల్లె గ్రామంలో వెలసిన శ్రీ కోదండరామ స్వామి వారి ఆలయంలో 69వ శ్రీరామనవమి మహోత్సవాలు ఈనెల 6వ తేదీ ఆదివారం నుండి 16వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 7వ తేదీ ఉదయం 9 నుండి 10 గంటల మధ్య నూతన ఉత్సవ విగ్రహ ప్రాణప్రతిష్ట, 8, 9, 10 ,11 తేదీలలో ప్రతిరోజు ఉభయదారులచే పూజలు తీర్థప్రసాద వినియోగం, 12 శనివారం పౌర్ణమి సందర్భంగా యాదవ సంఘం వారిచే శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం, 15న పుష్ప పల్లకి సేవ, 16 ఉట్ల తిరుణాల రాత్రి 8 గంటలకు ఏకాంత సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ప్రముఖ హరికథా భాగవతారిని పుష్ప భారతి చే హరికథా కాలక్షేపం, వాయిద్య సహకారం హార్మోనియం సురేష్, తబలా డమరేష్ యాదవ్ అందజేస్తారని తెలియజేశారు.

అలరించిన 'సంస్కృత' నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ డాక్టర్ కిషోర్స్ రత్నం స్కూల్ చే విద్యార్థులకు శాస్త్రీయ సంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకు సంస్కత పేరుతో శాస్త్రీయ నత్య ప్రదర్శన కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మహతి ఆడిటోరియం లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆ స్కూల్ డైరెక్టర్స్ డాక్టర్ కష్ణ కిషోర్, వసంత కిషోర్ మాట్లాడుతూ భారతీయ కళల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు, తమ స్కూలు ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా సంస్కత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ పురుషోత్తం, రవి, వంశీకష్ణ పాల్గొన్నారు.